

సాక్షి
పల్నాడు
శుక్రవారం, 15, సెప్టెంబర్, 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2,901 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1,001 క్యూసెక్కులు వదిలారు.



30 టీఎంసీలకు పులిచింతల

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టులో నీటినిల్వ గురువారం సాయంత్రానికి 30 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 6543 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పశువైద్య వర్సిటీ పాలకమండలి సభ్యులుగా యుగంధర్ కుమార్

నెహ్రూనగర్ : శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం (తిరుపతి) పాలక మండలి సభ్యులుగా గుంటూరు జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు పాలకమండలి సభ్యులుగా వ్యవహరించనున్నారు.



న్యూస్‌రీల్

నేడు మిర్చి యార్డు పాలకవర్గ సమావేశం



కొరిటిపాడు : గుంటూరు మార్కెట్ యార్డు పాలకవర్గ సమావేశం చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరుగుతుందని మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. సమావేశంలో మార్కెట్ యార్డుకు సంబంధించి ఆదాయ వ్యయాలు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు.

హుండీ ఆదాయం రూ.20 లక్షలు



దుర్గి : అడిగొప్పుల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ. 20,31,890ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. గురువారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కారంపూడి గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి కృష్ణంరాజు ఆధ్వర్యంలో 43 రోజులపాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సన్నిగళ్ళ గ్రూప్ టెంపుల్స్ ఈఓ సైదమ్మ బాయి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణానికి చెక్కు అందజేత




భట్టిప్రోలు: ఐలవరం రామలింగేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున చేతుల మీదుగా కార్యనిర్వహణాధికారి జీవీఎల్ కుమార్‌కు రూ. 2 లక్షలు చెక్కు అందజేశారు. దేవాలయ పునర్నిర్మాణానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అడిగిన మేరకు దేవదాయ శాఖాధికారులతో మాట్లాడి ఇందు కోసం రూ. 20 లక్షలు మంజూరు చేయించినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, కేబీవీ రమణ, మాచర్ల తులసీ రంగారావు, గట్టు శ్రీనివాసరావు, జొన్నాదుల శరత్‌బాబు, వెనిగళ్ల నాంచారయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్ : ఇస్సప్పాలెం గ్రామంలోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణం పనులకు పట్టణానికి చెందిన న్యూ హాలీవుడ్ షూ ల్యాండ్ యజమాని చింతగుంట రఘురామిరెడ్డి, కిరణ్మయి దంపతులు రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదగా విరాళం చెక్‌ను ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డికి అందించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 7,803 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

ఆనందాల ఆరుతడి

ముందస్తు రబీ.. శుభమస్తు

- సాగర్‌లో నీటి కొరత, వర్షాభావంతో తగ్గిన ఖరీఫ్ సాగు
- సార్వాలో పత్తి సాగుకు ముగిసిన గడువు
- వరికి సరిపోని నీటినిల్వలు
- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి
- మినుము, పెసర, అలసంద, కంది సాగుకు అనుకూలం
- ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం



ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

సాక్షి, నరసరావుపేట: వర్షాభావం, నాగార్జున సాగర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో ఆరుతడి పంటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా లేకపోవడంతో ఖరీఫ్ ఆశాజనకంగా లేదు. సార్వాకు కీలకమైన ఆగస్టు నెలలో 68 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఫలితంగా ఇప్పటి వరకు ఖరీఫ్‌లో 29 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. గతేడాది ఖరీఫ్‌లో ఇదే సమయానికి 59 శాతం మేర పంటలు సాగులోకి వచ్చాయి. ఇప్పటి వరకు పత్తి 44 శాతం, మిర్చి 25 శాతం సాగు నమోదైంది. దీంతో రైతులు ముందస్తు రబీలో భాగంగా ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిసారిస్తున్నారు. వ్యవసాయాధికారులు ఇదే ఉత్తమమని సూచిస్తున్నారు. ఆ దిశగా కర్షకులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆరుతడి పంటలు వేసుకోవాలని చెబుతున్నారు. అయితే సెప్టెంబర్ నెలలో సాధారణ వర్షపాతం కన్నా 164 శాతం అధికంగా పడటం కొంత ఉపశమనం కల్పిస్తోంది. ఈ వర్షాలను ఉపయోగించుకొని విత్తనాలు విత్తుకున్నట్లయితే రైతులకు తక్కువ పెట్టుబడితో ఎంతో కొంత ఆదాయం లభించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

పల్నాడు జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఇలా(హెక్టార్లలో)..	
సాధారణ విస్తీర్ణం :	2,76,947
ఇప్పటి వరకు సాగు :	79,786
గతేడాది ఈ వేళకు సాగు :	1,71,167

నీటి వనరులు ఉంటే జొన్న విత్తుకోవచ్చు

ఖరీఫ్‌లో పత్తి పంట సాధారణ విస్తీర్ణం 1,21,621 హెక్టార్లు కాగా, ఇప్పటివరకు 53,938 హెక్టార్లలో సాగైంది. వరి సాధారణ విస్తీర్ణం 49,202 హెక్టార్లు కాగా ఇప్పటికి కేవలం 4,183 హెక్టార్లలోనే సాగైంది. కొందరు రైతులు సాగర్‌కు సెప్టెంబర్ చివరి నాటికి నీరు వచ్చినా 120 రోజుల వ్యవధిగల హెచ్‌ఎంటీ, అంకుర్‌సోనా రకం వరి వంగడాలు సాగు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. పత్తి పంట సాగుకు ఇప్పటికే సమయం మించిపోయింది. వరి సాగుకు సరిపడా నీరు కాలువల్లో లేదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలే మేలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మినుము, పెసర, అలసంద, కంది, జొన్న, శనగ పంటలు మేలని పేర్కొంటున్నారు. ఒకటి లేదా రెండు నీటి తడులకు వెసులుబాటు ఉన్న భూముల్లో మొక్కజొన్న, జొన్న పంటలను అక్టోబర్ నెలలో విత్తుకోవచ్చని సూచిస్తున్నారు.

విత్తనాలు సిద్ధం

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతుల కోసం వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలను సిద్ధం చేస్తున్నారు. మండలాలవారీగా అవసరతపై నివేదికలు తెప్పించారు. కంది 981 క్వింటాళ్లు, మినుములు 320 క్వింటాళ్లు, పెసర 25 క్వింటాళ్లు, శనగ 12,100 క్వింటాళ్లు అవసరమని అంచనా వేశారు. రాయితీతో రైతులకు ఆర్బీకేల ద్వారా అందించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచనున్నారు.

ఆర్బీకేల ద్వారా విత్తనాలు



ముందస్తు రబీ పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతుల కోసం విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మండలాల వారీగా ప్రత్యామ్నాయ పంట విత్తనాలు ఏ మేరకు అవసరమో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. రైతులకు ఆర్బీకేల ద్వారా విత్తనాలు అందిస్తాం. మినుము, పెసర, కంది, శనగ వంటి పంటలకు కనీస మద్దతు ధర అధికంగా ఉండటం రైతులకు మేలు చేస్తుంది.

– ఐ.మురళి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ప్రత్యామ్నాయమే మేలు



సాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉండటం, వర్షాభావ పరిస్థితులతో సమయం మించిపోవడం వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లడం ఉత్తమం. ఆ దిశగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా మినుము, పెసర, కంది, శనగ విత్తుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. కనీసం రెండు తడులు నీటిని అందించగలిగితే మొక్కజొన్న సాగు ఉపయుక్తం.

–డాక్టర్ జి.రమేష్, సీనియర్ సైంటిస్ట్, డాట్ సెంటర్, పల్నాడు జిల్లా

నవంబర్‌లో ‘జగనన్న విద్యాజ్యోతి’



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది ‘‘జగనన్న విద్యాజ్యోతి’’ స్టడీ మెటీరియల్ అందనుంది. జిల్లా పరిషత్ నిధులతో గతేడాది ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేసిన మెటీరియల్ అధిక మార్కుల సాధనకు దోహదపడింది. దీంతో ప్రస్తుత ఏడాది కూడా స్టడీ మెటీరియల్ రూపకల్పనకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రత్యేకంగా శ్రద్ధ చూపించారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఎంపిక చేసిన సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యాశాఖాధికారులు జెడ్పీకి అందజేశారు. గత ఏడాది మెటీరియల్ ముద్రణకు రూ.61.80 లక్షల నిధులను వెచ్చించారు. అప్పట్లో 36,155 మంది విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ బడుల్లోని టెన్త్ విద్యార్థులందరికీ మెటీరియల్ అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నవంబర్‌లో మెటీరియల్‌ను పంపిణీ చేయనున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఇటీవల జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రకటించారు.

సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహంతోనే

గతేడాది టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించాం. దీనికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రశంసలు అందుకున్నాం. మెటీరియల్ టెన్త్ ఉత్తీర్ణతా శాతం పెంపునకు దోహదం చేసింది. సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహంతో వరుసగా రెండో ఏడాదీ స్టడీ మెటీరియల్ పంపిణీకి చర్యలు చేపడుతున్నాం.

– కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ చైర్‌పర్సన్

జెడ్పీ ఆస్తుల రక్షణకు చర్యలు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ ఆస్తుల రక్షణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధికారులను ఆదేశించారు. గురువారం జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో హెచ్ సెక్షన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ సెక్షన్‌లో పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూలు చేయడంలో అనుసరించాల్సిన విధి, విధానాలపై సమీక్షించారు. కోర్టు కేసులు, జెడ్పీ వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల నుంచి అద్దెల వసూలు, జెడ్పీ ఆస్తులు, అతిథిగృహాల పరిరక్షణ, నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఆక్రమణల్లోని ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.



సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

గురజాల అభివృద్ధికి కృషి

- ఎస్సీల కోసం శ్మశాన వాటిక
- నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వేదికపై ఎమ్మెల్యే కాసు, కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: గురజాల నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో గురజాల నియోజకవర్గస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి లేవనెత్తిన పలు అంశాలపై మంత్రి కారుమూరి స్పందిస్తూ మాచవరం తంగెడులో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. వచ్చే 15 రోజులలో 22ఏ జాబితాలో నిషేధిత భూముల తొలగింపును పూర్తిచేయాలన్నారు. జానపాడు, మోర్జంపాడు గ్రామాల్లో ఎస్సీలకు ఇచ్చిన భూములను ల్యాండ్ అక్విజిషన్ ద్వారా వారంలోగా కేటాయించాలన్నారు. గురజాలలో ఎస్సీ శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని చెప్పారు. గొట్టిముక్కల గ్రామంలో సుమారు 150 మంది లబ్ధిదారులకు సంబంధించిన అసైన్డ్ భూముల కేటాయింపు చేపట్టాలన్నారు. దాచేపల్లిలో తొలివిడత 800 పట్టాల సమస్య త్వరగా పరిష్కరించాలన్నారు. మాడుగలలో 48 మంది లబ్ధిదారులకు సంబంధించి సుమారు 80 నుంచి 90 ఎకరాలు అసైన్డ్ భూముల పెండింగ్ సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన పలు సమస్యలకూ పరిష్కారం చూపాలన్నారు. నిధులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. గురజాలలో 24 గంటల విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

మాచర్లలో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం పూర్తిచేస్తాం

- ప్రైవేట్ లేఅవుట్ల కట్టడికి చర్యలు తీసుకోండి
- నగరవనం ఏర్పాటుకు చర్యలు
- ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే పిన్నెల్లి వేదికపై కలెక్టర్ శివశంకర్, ఎంపీ లావు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: మాచర్లలో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం పూర్తిచేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించిన మాచర్ల నియోజకవర్గ సమీక్ష సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు లేఅవుట్లు, నగరవనం, జగనన్న ఇళ్లు, తాగునీటి పథకాలు, ఉపాధ్యాయుల కొరత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తదితర అంశాలపై సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీ సమీక్షలు నిర్వహించి చేపట్టిన అభివృద్ధి పనుల పూర్తి, సమస్యల పరిష్కారంపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నామన్నారు. జగనన్న కాలనీలకు కావాల్సిన స్థలాన్ని లెవలింగ్ చేసి లేఅవుట్లు వేసి పట్టాలు పంపిణీ చేసినా లేఅవుట్లకు అనుమతులు ఇవ్వకుంటే త్వరగా ఇవ్వాలన్నారు. అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేట్ లేఅవుట్లపై మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మంత్రి కారుమూరి, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి డీపీఓ ఎంవీ భాస్కరరెడ్డిని ప్రశ్నించారు. ప్రైవేట్ లే అవుట్లను అనుమతించవద్దని సూచించారు. కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. వరికెపుడిశెల ప్రాజెక్ట్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అటవీ అనుమతులు మంజూరుపై సంబంధిత శాఖల అధికారులను ప్రశ్నించారు. వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు జిర్రివాగు వాటర్ స్కీంకు సంబంధించి అవసరమైన మరమ్మతులు చేసి పైప్ లైన్‌లు వేసి ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులకు త్వరగా టెండర్లు పూర్తి చేసి పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతపై నివేదిక అందుబాటులో ఉంచాలన్నారు. మాచర్ల ప్రభుత్వ డిగ్రీ కాలేజికి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న పాలిటెక్నిక్ కాలేజి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అర్బన్, రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఫార్మసిస్టు, డెంటిస్ట్ పోస్టుల భర్తీ కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మాచర్లలో నగరవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 17,022 అర్జీలు రాగా, 16,470 పరిష్కరించినట్లు వివరించారు. అదే స్ఫూర్తితో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో దూరవిద్య బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ అధ్యయన కేంద్ర ప్రాంతీయ సమన్వయకర్త పి.గోపీచంద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లోనూ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. యూజీ ద్వితీయ, తృతీయ, పీజీ ద్వితీయ సంవత్సర ఫీజులు చెల్లించేందుకు ఈనెల 30 చివరి తేదీగా తెలిపారు. వివరాలకు 0863– 2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మీ చిట్టి చేతులతో మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. ‘అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా’ అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

District sponsor

శిబిరం చిరునామా:

సీబీఐటీ స్కూలు, నియర్ 60 ఫీట్ రోడ్,ప్రకాష్‌నగర్, నరసరావుపేట.

తేదీ : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 97030 13015

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.4,500, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.5,800 వరకు పలికింది.

క్లుప్తంగా

నేడు రొంపిచర్లలో జగనన్నకు చెబుదాం

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జి.అంకారావు, ఎంపీడీఓ కె.మ్యాథ్యూబాబు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను వారు మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డితో కలసి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు కలెక్టరేట్‌లో ఎంప్లాయీస్ గ్రీవెన్స్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం సాయంత్రం 3గంటలకు కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాలులో ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులకు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వ ఆదేశానుసారం శుక్రవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు జిల్లా కార్యాలయంతోపాటు ప్రతి డిపో మేనేజర్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉద్యోగులు ఆన్‌లైన్ లేదా వ్యక్తిగతంగా దరఖాస్తు సమర్పించి సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌గా డాక్టర్ రవిశంకర్‌రెడ్డి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగ ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌గా యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి రవిశంకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ రవిశంకర్ రెడ్డి ఇప్పటి వరకు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ రవిశంకర్ రెడ్డికి యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అభినందనలు తెలిపారు. రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజారోగ్యానికి రక్ష

- నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- ఇంటింటికీ ఏఎన్‌ఎంలు, వలంటీర్లు
- ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలు



ఫణిదం పీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ యు.శ్రీలక్ష్మీకవిత

సత్తెనపల్లి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్న విషయం తెలిసిందే. వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతో దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేస్తోంది. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష అనే మరో కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్ల వద్దకే వెళ్లి జబ్బులున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం దీనిని అమలు చేయనుంది.

నేటి నుంచి ఇంటింటికి వలంటీర్లు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నుంచి గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తారు. ఆరోగ్యశ్రీ కరపత్రాన్ని పంపిణీ చేసి సేవలను వివరిస్తారు. శనివారం నుంచి నిర్వహించే సర్వేలో భాగంగా ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గృహాలను సందర్శించి ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలను గుర్తిస్తారు. ఇంటింటి సర్వే సమయంలో సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, తగిన బరువు లేని పిల్లలు, క్షయ, కుష్టు, సంక్రమించని, సంక్రమించే వ్యాధులు, మలేరియా, డెంగీ తది తరాలతో బాధపడుతున్న వారిపై దృష్టి సారిస్తారు. సర్వే సమయంలో ఫొటో తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. పరీక్ష ఫలితాలను డాక్టర్లకు అందుబాటులో ఉంచుతారు. ఆరోగ్య సమస్యలున్న వారు వైద్య శిబిరాలకు హాజరయ్యేందుకు వీలుగా ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు టోకెన్ ఇస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందిస్తున్నారు. జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక అధికారులను నియమించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు.

మండలాల్లో మెగా వైద్య శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న మండలాల వారీగా మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో ఇద్దరు డాక్టర్లు ఉంటారు. వీరితోపాటు 104లో ఉండే డాక్టరు అందుబాటులో ఉంటారు. మండలంలో ఎన్ని విలేజ్ హెల్త్ క్లినిక్ ఉన్నాయో ఆ పరిధిలో గుర్తించిన రోగులందరికీ ఆ రోజు వైద్య శిబిరంలో చికిత్సలు అందించే విధంగా చర్యలు చేపట్టనున్నారు. శిబిరాల నిర్వహణలో ఎంపీడీఓ, తహసీల్దార్లు మొదలు అన్ని శాఖల అధికారులు పాలుపంచుకోవాల్సి ఉంటుంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రెండు అంశాలు కీలకం కానున్నాయి. ఇంటింటికి వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు జబ్బులను గుర్తించడం ఒక అంశమైతే .. వారికి చికిత్స చేయించేందుకు రిఫరల్ కోసం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం రెండో అంశం.

దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి

మధుమేహం, క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలు, కిడ్నీ సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు. ఇందుకోసం ఆరోగ్య సిబ్బందికి ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్యోద్దేశం. ఇంటింటికి వలంటీరు, ఏఎన్ఎంలు వెళ్లి సర్వేను నిర్వహించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఈనెల 30న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో మండల స్థాయిలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ యు.శ్రీలక్ష్మీ కవిత, వైద్యాధికారిణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఫణిదం

రాజమండ్రి జైలు సాక్షిగా టీడీపీ, జనసేన పొత్తు

ప్రభుత్వ విప్ పీఆర్కే



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లు

వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదట నుంచి చెబుతున్నట్లుగానే రాజమండ్రి జైలు సాక్షిగా టీడీపీ, జనసేన పొత్తు బయటపడిందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఒంటరిగా పోటీ చేస్తే 23 సీట్లు కూడా రావని భయపడి దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌తో పొత్తుకు టీడీపీ ఒప్పుకుందన్నారు. 175 సీట్లకు విడివిడిగా పోటీ చేసే ధైర్యం లేక ఈ రెండు పార్టీలు ఒక్కటయ్యాయన్నారు. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా, వైఎస్సార్ సీపీ ఒంటరిగానే పోటీ చేసి ఇప్పుడున్న 151 సీట్ల కన్నా ఎక్కువ సాధిస్తుందన్నారు. ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్‌ను టీడీపీ వద్ద ప్యాకేజీతో పాటు ఒక 20 సీట్లు అడుక్కుంటుందన్నారు. విడిగా పోటీ చేస్తే ఈ రెండు పార్టీలకు 175 మంది అభ్యర్థులు దొరికే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబును అరెస్టు చేస్తే సొంత పుత్రుడు లోకేష్ కన్నా దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌కే ఎక్కువ బాధ ఉందన్నారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి పథకాలతో మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొస్తాయన్నారు. నారా లోకేష్‌ను అరెస్టు చేస్తే ఆ పార్టీని కాపాడే వాడు లేడన్నారు. పవన్ కల్యాణ్ ఒక ప్రాంతానికి చెందిన నాయకుడే తప్ప రాష్ట్రస్థాయిలో ఆయన ప్రభావం లేదన్నారు.

రూ.2 కోట్లతో తాగునీటి పథకం



మాట్లాడుతున్న ఎంపీ లావు, పక్కన ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ ఏసురత్నం తదితరులు

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు
- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

గురజాల: రూ.2 కోట్లతో తాగునీటి పథకం ప్రారంభించి ప్రతి ఇంటికీ కృష్ణానది నీటిని అందించడం జరుగుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో గురువారం రాత్రి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పులిపాడు గ్రామం అభివృద్ధి చెందిందన్నారు. అర్హత ఉంటే చాలు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత పాలకులు అభివృద్ధి చేయకుండా కేవలం దాచుకో...దోచుకో అనే నినాదంతో పనులు చేశారని విమర్శించారు. అభివృద్ధి చేయడానికి ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని వెంటనే అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పాలన అందించడం జరుగుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గత పాలకులకు ఈ పాలనకు తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. పెండింగ్‌లో వున్న పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, గుంటూరు రైల్వే బోర్డు డైరెక్టర్ కె రవిశంకర్ తదితరులున్నారు.

స్కిల్ హబ్‌లో ట్రైనర్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేటఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ ప్రోగ్రాం చేపట్టినట్టు జిల్లా నైపుణాభివృద్ధి అధికారి కె.సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్/ స్కిల్ కళాశాలల్లో ట్రైనర్స్‌గా నియమించేందుకు అర్హత, అనుభవం ఉన్న అభ్యర్థులకు వివిధ అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మేనేజ్‌మెంట్, చేతివృత్తులు, వ్యవసాయం, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, ఐటీ–ఐటీఈఎస్, హెల్త్‌కేర్, టెలికాం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ స్కిల్డ్ కౌన్సిల్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ తదితర అంశాలలో శిక్షణ ఇచ్చి ట్రైనర్స్‌గా నియమించనున్నట్టు వివరించారు. వివరాలకు వీరాంజనేయులు (సెల్ : 9160200652) లేదా లింగంగుంట్లలోని ఎన్ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

పారదర్శకంగా దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థుల పరుగు పోటీలను పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా కొనసాగుతున్నాయి. ముందుగా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల్ని పోలీసు అధికారులు నిశితంగా పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతలను నమోదు చేసుకున్నారు. అనంతరం జరిగిన 100, 1,600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీల్లో అర్హత సాధించేందుకు అభ్యర్థులు పోటీపడ్డారు. 705 మందికి గానూ 384 మంది అర్హత సాధించారు. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, మంగళగిరి బెటాలియన్ కమాండెంట్ కె.ఎస్.ఎస్.వై సుబ్బారెడ్డి గురువారం గ్రౌండ్‌లో మౌలిక సౌకర్యాల్ని పరిశీలించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐజీ పాలరాజు పోలీస్ అధికారుల్ని ఆదేశించారు. సందేహాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా పోటీల్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.సుప్రజ, డీఎస్పీలు శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రావు, నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు, ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు, మినిస్ట్రీయల్ సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్‌యూ ఆచార్యులకు ప్రపంచస్థాయి గుర్తింపు



డాక్టర్ ఎం. జానకిరామయ్య



డాక్టర్ బొగ్గవరపు నాగేశ్వరరావు

తాడేపల్లిరూరల్ : స్థానిక వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలోని ఆచార్యులకు ప్రపంచ స్థాయి టాప్ 2 శాతం శాస్త్రవేత్తలో స్థానం లభించినట్లు వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ గురువారం అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రపంచస్థాయిలో అత్యంత ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలను గుర్తించి వారిలో 2 శాతం శాస్త్రవేత్తల పేర్లను ప్రకటిస్తుందని, అందులో భాగంగా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ బొగ్గవరపు నాగేశ్వరరావు, బయో టెక్నాలజీ విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ ఎం. జానకి రామయ్య పేర్లను 2023 సంవత్సరానికి ప్రకటించిన జాబితాలో ఉన్నాయన్నారు. నాగేశ్వరరావు, జానకి రామయ్యలను వర్సిటీ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ , ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. శ్రీనివాసులు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విజయ్‌కుమార్‌లు అభినందించారు.

న్యాయస్థానాల ప్రాంగణాల్లో భద్రతా పరిరక్షణకు పరిశీలన



వివరాలు నమోదు చేస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ రాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సత్తెనపల్లి డీఎస్పీ

సత్తెనపల్లి: న్యాయస్థానాల్లో భద్రతా పరిరక్షణకు పోలీసు ఉన్నతాధికారులతో కూడిన బృందం జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తోంది. గురువారం సత్తెనపల్లి సబ్‌కోర్టు ప్రాంగణాన్ని ఏఆర్ పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణతో కూడిన బృందం సత్తెనపల్లి సబ్‌కోర్టును సందర్శించింది. న్యాయస్థాన ప్రాంగణాల్లో సెక్యూరిటీ, సీసీ కెమెరాలు, కోర్టు గార్డులు, సంచలనాత్మకమైన తీర్పులు ప్రకటించే సమయంలో అదనపు సెక్యూరిటీ, పార్కింగ్, మెటల్ డిటెక్టర్స్, పెట్రోలింగ్, అత్యవసర వైద్యం, కమ్యూనికేషన్స్, ఫైర్ ఫిట్టింగ్స్, మొబైల్ బారికేడ్లు తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్త పరిశీలనలో భాగంగా సత్తెనపల్లి సబ్ కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించి నమోదు చేసుకున్నారు. వారితోపాటు సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ ఉన్నారు.

రాష్ట్ర ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



గుంటూరు వెస్ట్ (క్రీడలు): కాకినాడలో ఈ నెల 12న జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన చిన్నారులు పలు పతకాలు సాధించారని జిల్లా ఫెన్సింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి డి.అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–10 వ్యక్తిగత విభాగంలో అద్దేపల్లి ఆశియా హస్నా బంగారు పతకం, టీం విభాగంలో రజతకం, అండర్–10 వ్యక్తిగత విభాగంలో మల్లి జోస్నిక రెడ్డి, చింతా ఆరోహిణి, కొల్లిపర శాన్వి, మందాలి నైనిక రెడ్డి, కాకర్ల లక్ష్మీ కార్తిక కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. అండర్–10 బాలకల టీం విభాగంలో ప్రథమ స్థానం పొందారని పేర్కొన్నారు. అండర్–10 బాలురల్లో పొత్తూరు విశాంక్ శర్వాంగ్‌కు కాంస్యం సాధించాడని చెప్పారు.

పేదలకు ఇంటి వద్దకే వైద్య సేవలు

వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై షేక్



పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజలకు వైద్యాన్ని గడప ముంగిటకు తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై. షేక్ చెప్పారు. ఎత్తు రోడ్డు సెంటర్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం ఆరోగ్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారనీ, ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈనెల 15 నుంచి 29వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికీ తిరిగి ఆయా నివాసాల్లో ఎవరూ ఏ వ్యాధితో బాధపడుతున్నారో తెలుసుకోవడం జరుగుతోందన్నారు. ఈనెల 30 నుంచి 45 రోజులపాటు నలుగురు వైద్యులతో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారన్నారు. ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగనుందన్నారు. ఉచిత వైద్యం అందించడంతో పాటు, సంబంధిత రోగులకు మందులు కూడా పంపిణీ చేస్తారన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ, 108, 104, విల్లేజ్ క్లీనిక్‌తోపాటు, అనేక ఆరోగ్య పథకాల ద్వారా పేద వారి ఆరోగ్యానికి భరోసా కల్పించిన సీఎం జగనన్న ఆరోగ్యశ్రీ సురక్ష ద్వారా వారికి మరింత మనోధైర్యం కల్పించనున్నారన్నారు. జిల్లాలో సైతం ప్రభుత్వ నిర్ణయానికి సహకరిస్తూ డాక్టర్స్ విభాగం ఆధ్వర్యంలో 50 మంది వైద్యులు బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. దీంతోపాటు ఈనెల 15 నుంచి 29వ తేదీ వరకు జరిగే ఇంటింటికి సర్వే కార్యక్రమంలో డాక్టర్స్ సెల్‌కు సంబంధించిన వైద్యులు పాల్గొని ఆరోగ్యశ్రీ పట్ల అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

భద్రాచలం రాములోరి నైవేద్యానికి అత్తోట నుంచి బియ్యం



బియ్యంతో ప్రకృతి రైతులు, భూమి భారతి నిర్వాహకులు

తెనాలి: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి నిత్యం సమర్పించే 'బాల భోగం' నైవేద్యానికి కొల్లిపర మండల గ్రామం అత్తోటలోని 'భూమి భారతి' నుంచి బియ్యాన్ని పంపారు. ప్రకృతి వ్యవసాయం, దేశవాళీ వరి విత్తన నిధి, గోఆధారిత ఉత్పత్తుల కేంద్రమైన 'భూమి భారతి' ఆధ్వర్యంలో రైతులు ప్రకృతి విధానంలో పండించిన అయిదు రకాల బియ్యాన్ని సమర్పించారు. అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయులు జయశేఖర్ తాళ్లూరి–నీలిమ తాళ్లూరి దంపతుల సౌజన్యంతో ఏడాదిపాటు ప్రతినెలా ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని భద్రాచలం దేవస్థానానికి సమర్పిస్తారు. తొలిగా అయిదు రకాల బియ్యం మూడు కిలోలను గురువారం సాయంత్రం ప్రత్యేక వాహనంలో పంపారు. ఈ సందర్భాన్ని వేడుక చేశారు. భూమి భారతి కేంద్రం నుంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. చెక్క భజనలు, మేళతాళాలతో ఊరేగింపుగా ఊరి వెలుపల వరకు సాగనంపారు. కార్యక్రమంలో అత్తోట గ్రామానికి చెందిన ప్రకృతి రైతులు, భూమి భారతి నిర్వాహకులు పాల్గొన్నారు.